# సింగిల్ పేజీ కథలు

# పరీక్ష

"హాయ్ శ్రీధర్" పరాకుగా నడుస్తున్న శ్రీధర్ వెనక్కి తిరిగి చూశాడు.

"బెస్టాఫ్‌లక్" శశికాంత్ చిన్నగా నవ్వుతూ చెప్పాడు.

"సేమ్ టూ యూ"

"భలే నెర్వస్‌గా ఉంది. ఏం చేస్తానో ఏంటో పరీక్షలో"

"నాకూ అలాగే ఉంది. ఈరోజు క్లాస్‌లో అస్సలు కాన్సన్‌ట్రేషన్ కుదర్లేదు"

"నాక్కూడా"

"ఇంతకీ నీదేం సెక్షన్"

"సి. నీది ఏ కదూ"

"ఊ..మోహన్‌ది 'సి'!

"సార్ ప్రిన్సిపాల్‌గారు మిమ్మల్ని పిలుస్తున్నారు" చంద్రయ్య పిలుపు అందించాడు.

శ్రీధర్, శశికాంత్ కాస్త దిగులు, టెన్షన్ కూడుకున్న మొహాలతో ప్రిన్సిపాల్ గది వైపు నడిచారు.

"బెస్టాఫ్‌లక్ టు బోత్ ఆఫ్ యూ" ప్రిన్సిపాల్ చిరునవ్వుతో విష్ చేశారు.

"థాంక్యూ సర్"

"ఓ.కే..రేపు మీకు సెలవు. మనసు ప్రశాంతంగా ఉంచుకుని కాన్సన్‌ట్రేషన్ పెంచుకోండి. వన్స్ ఎగైన్ బెస్టాఫ్‌లక్"

* * *

"ఏంటో భయంగా ఉంది. ఏం చేస్తానో ఏంటో" శ్రీధర్ దిగులుగా అన్నాడు.

"భయం ఎందుకురా వెర్రి నాగన్నా ఇదివరకు ఎన్ని పరీక్షలు రాయలేదు" సత్యవతమ్మ కొడుక్కి ధైర్యం చెప్పింది.


"అవన్నీ వేరు..ఈ పరీక్ష వేరు" శ్రీధర్‌కి జ్వరం వచ్చినట్టుగా ఉంది.

"గేట్‌లో నెగ్గుకొచ్చిన మీకు ఇదో లెక్కా" స్రవంతి ధైర్యం చెప్పింది.

"ఇంతకీ ఇదేం పరీక్షరా..'చాప' పరీక్ష కాదు కదా కొంప దీసి..ఒక్కగానొక్క నలుసువి. మీ నాన్నగారు లేరని నన్నొదిలేసి ఎంచక్కా ఆ మాయదారి చాప మీద కూర్చుని అమెరికా వెళ్ళిపోవాలనుకుంటున్నావేమో అదేం కుదరదు"

అత్తగారి మాటలకి పక్కున నవ్వొచ్చింది స్రవంతికి. ఇదివరకు 'జి.మేట్' పరీక్ష ఇచ్చి శ్రీధర్ అమెరికా వెళ్ళాలనుకున్నప్పుడు ఇంట్లో పెద్ద భారతమే జరిగింది. సత్యవతి, సుందరమూర్తులకి ఏకైక సంతానం శ్రీధర్. ఊళ్ళో మాగాణిపొలాలు, తోటలు, దొడ్లు, తోపులు అన్నీ ఉన్నాయి. అసలు ఉద్యోగం చేయాల్సిన అవసరమే లేదు శ్రీధర్‌కి. కూర్చుని తిన్నా మూడు తరాలకి సరిపడే ఆస్తి ఉంది. శ్రీధర్ చిన్నప్పటి నుంచీ చదువులో చురుగ్గా ఉండేవాడు. అందుకే ఇంజనీరింగ్ పూర్తి చేసి ఆపై చదువులు చదవాలనుకున్నాడు. అమెరికా కాకపోతే ఇక్కడే చదువుకుంటాను అన్నా సుందరమూర్తి పడనివ్వలేదు 'నాకొంట్లో బావుండటం లేదు. నా కళ్ళ ఎదుటే ఉండాలి' అంటూ. అందుకే శ్రీధర్ ఎంత గింజుకున్నా పై చదువులు చదవలేకపోయాడు. ఇంజనీరింగ్‌తో చదువుకి ఫుల్‌స్టాప్ పడింది.

"ఇది క్యాట్ పరీక్ష అత్తయ్యా..చాలా కష్టం"



"పరీక్షలో క్యాటులూ-డాగులూ కూడా ఉంటాయ్రా" సత్యవతమ్మకి ఆమాత్రం ఇంగ్లీష్ వచ్చు.

"గేట్లు కూడా ఉంటాయి మామ్మా" నవీన్ నవ్వుతూ అన్నాడు.

"మా రోజుల్లో స్కూల్ ఫైనల్ పెద్దపరీక్ష. ఇలా చాటలు, పిల్లులు, గేట్లు పరీక్షలుండేవి కావు. మా తమ్ముడు స్కూల్ ఫైనల్ చదువుతుంటే మాడు వేడెక్కిపోతుందని ఐస్‌ఫ్రూట్ కొని పెట్టేది మా అమ్మ. మందార నూనె మర్దనా చేసేది మాడుకి" సత్యవతమ్మ గతంలోకి జారుకుంటూ అంది.

"మామ్మా..మరి మా నాన్నకి కూడా ఐస్‌ఫ్రూట్ కొని పెట్టు. నవరత్న తైలం మర్దనా చెయ్యి" హరిణి అంటూంటే నవీన్, హరిణీ ఇద్దరూ పడీ, పడీ నవ్వారు.

స్రవంతికి నవ్వు వస్తున్నా బిగపట్టుకుని కళ్ళతోనే పిల్లలని వారిస్తూ ఎర్రగా చూసింది.

"నాన్నా..ఇదిగో 'హౌటూ ఇంక్రీజ్ యువర్ మెమరీ' పుస్తకం. దీన్ని చదివితే జ్ఞాపకశక్తి పెరుగుతుంది" నవీన్ తన షెల్ఫ్‌లోంచి ఓ పుస్తకం తెచ్చి శ్రీధర్‌కిచ్చాడు.

"ఇంత లేటు వయసులో..ఎంత ఘాటు పరీక్షయో" స్రవంతి సన్నగా కూనిరాగం తీసింది నవ్వుకుంటూ.

"నాన్నా ఒన్ టూ ట్వంటీ ముందుకీ వెనక్కీ లెక్కపెడితే జ్ఞాపకశక్తి పెరుగుతుంది" హరిణి తనూ ఓ ఉచిత సలహా ఇచ్చింది.

"అది కోపం తగ్గించుకోవడానికి మొద్దూ" నవీన్ హరిణిని వెక్కిరించాడు.

శ్రీధర్‌కి ఉక్రోషంగా ఉంది. ఆఖరికి పిల్లలకి కూడా వేళాకోళంగా ఉంది.

* * *

పరీక్ష హాల్లో అందరూ అటూ, ఇటూ తల తిప్పి చూడకుండా పెన్సిల్, పేపర్‌తో కుస్తీ పడుతుంటే శ్రీధర్ చేతిలో పెన్సిల్ ఉన్నా పేపర్‌మీద పెట్టకుండా క్వశ్చన్ పేపర్‌ని తదేకంగా చూస్తున్నాడు. శ్రీధర్ వెనక, పక్కన కూర్చున్న అబ్బాయిలు నోళ్ళు తెరుచుకుని శ్రీధర్ వైపు రెండు నిమిషాలు చూసి...గడిచిపోతున్న కాలం నింపాల్సిన సర్కిల్స్ గుర్తు తెచ్చుకుని పేపర్ మీద కాన్సన్‌ట్రేట్ చేశారు. స్టూడెంట్స్‌ని చూస్తున్న ఇన్విజిలేటర్ రెండుమూడుసార్లు శ్రీధర్‌ని జూలో జంతువుని చూసినట్టు పై నుంచి కిందిదాకా చూసి బుర్ర తడుముకుని, గడ్డం రుద్దుకుని 'వయసు మీరాక ఇలాంటి పరీక్షలకి వస్తే ఏం వస్తుంది' అనుకుని జాలిపడ్డాడు.

రెండు గంటలు పరీక్ష హాల్లో కూర్చుని నిండుగా ఉన్న నీళ్ళకుండాలా శ్రీధర్ భారంగా బయటికి నడిచాడు.

"ఏం సార్..పేపర్ కష్టంగా ఉందా" శ్రీధర్ వెనక బెంచీలో కూర్చున్న అబ్బాయి శ్రీధర్‌ని పలకరించాడు.

శ్రీధర్ ఏం మాట్లాడకుండా అతనివైపోసారి నిరాసక్తంగా చూసి గబగబా కాలేజి ఆవరణలో ఉన్న చెట్టు కిందకి చేరాడు. అప్పటికే శశికాంత్, మోహన్ అక్కడ ఉన్నారు. రెడీగా తెల్లకాగితాలతో నుంచున్న చంద్రయ్య చేతిలోంచి నాలుగు కాగితాలు లాక్కుని బరబరా రాయడం మొదలుపెట్టాడు శ్రీధర్.

కేంపస్‌లో అక్కడక్కడా స్టూడెంట్స్ గుంపులుగా చేరి ఒక్కొక్క సెక్షన్ గురించీ ఏమాత్రం స్కోర్ వస్తుందో అన్న దాని గురించీ అంచనాలు వేస్తున్నారు.

"ఒరేయ్ రవీ అటు చూడూ" శ్రీధర్ వెనక కూర్చుని శ్రీధర్ విచిత్రధోరణి గమనించిన ఉమేష్ ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

పరీక్షల్లో క్వశ్చన్ పేపర్ చదువుతూ కూర్చున్న తను బయటకొచ్చి అంత శ్రద్ధగా పరీక్ష రాసినట్టు ఏం రాస్తున్నాడు. అతనొక్కడే కాదు. ఇంకో ఇద్దరున్నారు పక్కన ఇదేం వింత.

"ఒరేయ్ అతను ఆ పచ్చషర్ట్ అతను నా ముందు కూర్చున్నాడురా..పెన్సిల్ పేపర్ మీద పెడితే ఒట్టు..క్వశ్చన్ పేపర్ చూడ్డానికోసమే కూచున్నట్టు రెండు గంటలూ పేపర్ చూశాడు. ఇప్పుడేమో బయటకొచ్చి పరీక్ష రాస్తున్నట్టు బరాబరా రాస్తున్నాడు" హేమంత్ అన్నాడు.

"ఆ గళ్ళచొక్కా శాల్తీ మారూమ్‌లో ఉన్నాడు. అతనూ అంతే..వీళ్ళు కాస్త వయసెక్కువ ఉన్నవాళ్ళల్లా లేరూ" ఆనంద్ సందేహం వ్యక్తం చేశాడు.

"వింత కేసులు" బుర్రనోసారి గోక్కుని మళ్ళీ వాళ్ళ మాటల్లో వాళ్ళు పడిపోయారు.

"నా స్కోర్ ముప్పై అయిదు" శ్రీధర్ మురిసిపోతూ అన్నాడు.

"ముప్పై ఎనిమిది..నీదెంత" శశికాంత్ మోహన్ వైపు చూశాడు.

"నాదీ ఇంచుమించు అదే రేంజ్‌లో ఉంది. పదండి పోదాం..ఆవు నెమరు వేసుకున్నట్టు కాస్త బుర్రకి పదును పెడితే ఇంకో నాలుగు వస్తాయి" మోహన్ లేస్తూ అన్నాడు. వాళ్ళ ముగ్గురి మొహాలు, సంతోషంతో, సంతృప్తితో వెలిగిపోతున్నాయి. ఒకళ్ళకొకళ్ళు 'కంగ్రాట్స్' చెప్పుకుని షేక్ హాండిచ్చుకుని చిరునవ్వులు చిందిస్తున్నారు.

"ఒరేయ్ వాళ్ళని చూడరా..ఏం ఘనకార్యం చేశారనో అలా చేతులు కలుపుకుని మరీ మురిసిపోతున్నారు. బ్లాంక్ పేపర్ ఇచ్చినందుకు సెలబ్రేషనా?" రవి అపనమ్మకంగా వాళ్ళవైపు చూస్తూ అన్నాడు.

"వాళ్ళేం మనలా పరీక్ష ఇవ్వడానికి రాలేదు. వాళ్ళు మనూళ్ళో కొత్తగా పెట్టిన 'ఏంజిల్స్' కోచింగ్ సెంటర్‌లో లెక్చరర్స్‌రా..ఎమ్.సెట్‌తో పాటు ఎం.బి.ఏ.కి కూడా కోచింగ్ ఇవ్వాలనుకుంటున్నారు. అందుకే క్వశ్చన్స్ హాల్లో చదివి బట్టీపట్టి ఇప్పుడు పేపర్ మీదకెక్కించారు" అప్పుడే అటుగా వచ్చిన సునీల్ వాళ్ళ సందేహం తీరుస్తూ జవాబిచ్చాడు.

"ఆ.." ఉమేష్, రవి ఆశ్చర్యంతో నోళ్ళు తెరిచేశారు నవ్వుకుంటూ కారెక్కి వెళ్ళిపోతున్న వాళ్ళని చూస్తూ.

**-సి.ఉమ (సూరత్)**

# పోలికలు

"అమ్మా! నీకు మనవడు పుట్టాడట. మా మావగారు ఇప్పుడే ఆఫీసుకి ఫోను చేసి చెప్పారు. నువ్వు హాస్పిటల్‌కెళ్ళి చూసిరా. నాకు ఇక్కడ పనెక్కువగా ఉంది. సాయంత్రం ఇక్కడి నుంచే అటు వెడతాను" ఫోన్‌లో కొడుకు మాటలు విని మనవడు పుట్టినందుకు సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యింది పార్వతమ్మ. కానీ వియ్యంకుడే స్వయంగా ఫోను చేసి ఆ సంగతి తనతో చెప్పనందుకు కించిత్ బాధ పడింది.

రిసెప్షన్‌లో రూం నెంబరు కనుక్కుని లోపలికెళ్ళింది.

అప్పటికే కామాక్షమ్మ ఒడిలో ముద్దులు మూటగట్టే పసివాడు నిద్రపోతున్నాడు. పార్వతమ్మ రాకను గమనించినా పలకరింపులేవీ లేకుండా ముభావంగా ఉండిపోయిందామె.

"అబ్బా! నా మనవడు ఎంత ముద్దొస్తున్నాడో! దబ్బపండులాంటి ఆ రంగూ..ఎంతైనా అమ్మమ్మ పోలికలతో పుట్టావురా కన్నా!" ఓరకంటతో వియ్యపురాలిని గమనిస్తూ పసిగుడ్డు తల చుట్టూ రెండు చేతులూ సుతారంగా తిప్పి కణతలకి వేళ్ళు అదిమిపెట్టి మెటికలు విరిచింది కామాక్షమ్మ.

"చాల్లే వదినా! పెద్ద చెప్పొచ్చావు. ఏదో మా వాడు పట్టుబట్టాడని వాడి కోరిక కాదనలేక కోడలు నలుపైతే కులమంతా నలుపన్న సామెత పట్టించుకోక మీ సంబంధం చేసుకున్నాం. అయినా అదృష్టం కొద్దీ మనవడు పసిమిఛాయతో పుట్టాడు. ఇదంతా ఆ తాత రంగు కాదూ.." మనవడ్ని అడ్డుపెట్టుకుని తన గొప్పలు చెప్పుకుంటున్న కామాక్షిపై అక్కసంతా మాటల్లో వెళ్ళగక్కింది పార్వతమ్మ.

"విశాలమైన నుదురూ, ఆ గిరజాల జుట్టూ అంతా మా శ్రావణిలాగే ఉన్నాడు. మొగపిల్లలకి తల్లి పోలికొస్తే అదృష్టమంటారు మరి"

"నాజూకుగా కొనదేలిన ఆ ముక్కుంది చూసావూ? అది మా అబ్బాయి ముక్కే" కామాక్షమ్మ అంతలా పోలికలు వర్ణిస్తుంటే తనకు మాత్రం ఏం తక్కువ అనుకుంటూ తను కూడా పోలికలు వర్ణించటంలో నిమగ్నమైంది పార్వతమ్మ.

"అదేం కాదు. అదీ మా శ్రావణి ముక్కే. మీ అబ్బా




యికి ఇంత సన్నని, నాజూకైన ముక్కు ఎక్కడిదీ?"

"అబ్బో! ఆ పెదవులు చూడు. చిన్న పోకచెక్కలా!" సుతారంగా వేలితో పసివాడి పెదవులు నిమిరింది పార్వతమ్మ.

"మా శ్రావణి పసిగుడ్డుగా ఉన్నప్పటి రోజుల్ని గుర్తుతెస్తున్నాడు"

"హు! మావాడికి బారసాల జరిగినప్పటి ఫోటో ఒకటి తెప్పించి చూపిస్తా. అచ్చు గుద్దినట్టు అదే పోలిక. అంతా తండ్రి పోలికే అని. అయినా మా వంశంలో మగాళ్ళందరికీ ఇలా చేతివేళ్ళూ కాలివేళ్ళూ భలే పొడుగ్గా ఉంటాయి" మురిసిపోయింది పార్వతమ్మ.

"నా మనవడ్ని మరీ అంత రెప్ప వేయకుండా చూడకమ్మా! దిష్టి తగిలేను." దాదాపు గుడ్లురుముతూ గయ్‌మంది.

"నీ మనవడేంటీ? పురుడు పోయటం, మూడు నెలల దాకా చాకిరీ చెయ్యటం వరకే మీ బాధ్యత. ఆ తర్వాత ఆటలూ, పాటలూ, ముద్దులూ ముచ్చట్లూ..అన్నీ మా ఇంట్లోనే. ఎంతైనా మా ఇంటి పేరున్నవాడు. మా వంశాన్ని నిలబెట్టేవాడు"

"సరేలేవమ్మా! మీ ఇంటి పేరు నిలబెట్టేవాడే. అలాగని నీ కొడుక్కి లక్షల కట్నం గుంజినట్లు మనవడి దగ్గరా పెత్తనం చేద్దామనుకుంటున్నావేమో! అదేం చెల్లదు. అప్పటికి కాలం మరింత మారిపోతుంది. కట్నం మాటెత్తితే ఆడపిల్లలే ధైర్యంగా ముందుకొచ్చి పళ్ళు రాలగొట్టే రోజులొస్తాయ్!"

"ఇచ్చారులే మహా రెండు లక్షలు. ముష్టిగా వేసినట్లు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. పెద్ద ఆదర్శాలు వల్లిస్తున్నావుగానీ నీ ఇద్దరు కొడుకులకీ చెరి మూడు లక్షలు, భారీగా లాంఛనాలూ తీసుకున్నారని తెలిసినా మేమేమీ డిమాండు చెయ్యకుండా ఇచ్చిందాంతో సరిపెట్టుకున్నాం"

"అమ్మా క్షమించండి. వీడు మీ మనవడు కాదు. మీ బాబుని ఇప్పుడే లేబర్ రూం నుంచి స్నానం చేయించటానికి తీసుకెళ్ళింది ఆయా. పక్క రూంలో ఇవ్వాల్సిన బాబుని పొరపాటున మీ గదికి తీసుకొచ్చి ఇచ్చాను. మరో ఐదు నిముషాల్లో మీ పిల్లాడిని మీకు అప్పగిస్తాను" అంటూ నర్సు వచ్చి పిల్లాడిని తీసుకెళ్ళిపోయింది.

వియ్యపురాళ్ళిద్దరూ అవాక్కయి ఒకరినొకరు చూసుకునే సాహసం చెయ్యలేక సిగ్గుతో తలదించుకున్నారు.

**-వి.యల్.వి.భారతి (మల్కాజిగిరి)**